

# ధూమళో చెరిగిపోయింది

అవధాన్లుగారు గొంతెత్తి ఆశీర్వచన పనస చదువుతుంటే దేవతలు దిగివచ్చి దీవిస్తున్నట్టుండేది. ఆయన గంభీరమైన కంఠం నుంచి వేదం వెలువడుతుంటే సుస్వరంగా వున్న మంచి సన్నాయి వాద్యం వింటున్నట్టు వుండేది. చెవుల కుండలాలు అల్లనల్లన కదలాడగా వేద స్వరానికి అనుగుణంగా ముద్రపడ్తూ నిండుగా ఉన్న అవధాన్లుగారు ఓ గొప్ప ఋషిలా కన్పడేవారు. అవధాన్లుగారి తండ్రి యజ్ఞం చేశారు. అవధాన్లుగారు యజ్ఞం చేయకపోయినా జీవితమంతా యజ్ఞంలా గడిపారు. ఆయన మంత్రించి ఇచ్చే విబూదికి గొప్ప మహత్తు ఉందని అందరికీ నమ్మకం. పొద్దున్న మొదలు అర్థరాత్రి దాకా గొల్లున ఏడుస్తూ జనం రావటం అవధాన్లుగారు ప్రేమగా నుదుట విబూది పెట్టి వాళ్ళంతా నిమరటం వాళ్ళబాధ తగ్గి వెళ్ళటం పరిపాటి.

ఆ విబూది మంత్రిస్తున్నప్పుడు ఆయన్ను చూడాలి. కళ్ళు మూసుకుని

అంతర్ముఖుడై పోయేవాడు. సర్వదేవతల్ని ఆవాహన చేస్తున్నట్టుండేది ఆయన ముఖం. క్షణంలో బిగుసుకు పోయేవాడు. బాధితుణ్ని వొళ్ళోకి తీసుకుని నిమిరేవాడు. అంతలో నవ్వుతూ అతగాడి కళ్ళలోకి చూసేవాడు. ఆ చూపులో కరుణ, దయ, నేనున్నాను నీకేం భయంలేదు అన్న హామీ. ఆ కడుపునొప్పివాడు నవ్వేవాడు, అలా వూరువూరంతా ఏ బాధొచ్చినా "అవధాన్లుగారున్నారు మనకేం భయం?" అన్నట్టుండేది.

ఒక రోజున ఒక మాల పోరగాడు ఓ రాత్రిపూట ఏదో చూసి జడుసుకుంటే మాటపోయి బిత్తర చూపులు చూడ్డం మొదలెట్టాడు. ఆ పోరణ్ణి వొళ్ళో పడుకోబెట్టుకుని 'ఏరా! ఏరా!' అంటూ వొళ్ళంతా నిమురుా వొంటి నిండా విబూదిరాసి వాడిచేత పలికించి, నవ్వించి పంపాడు. అది చూసి అవధాన్లుగారి భార్య సోమిదేవమ్మ "అయ్యో! అయ్యో! ఆ మాలవాణ్ణి ముట్టుకుంటారుటండీ?" అంటే "కడుపునొప్పి నీకూ వస్తుంది, వాడికీ వస్తుందే ... పట్టు నీకు విబూది పెడ్తాను" అన్నారు అవధాన్లుగారు. "నాకెందుకు విబూది?" అని ఆవిడంటే "నీ కీ రోగం పోవటానికి" అని విబూది పెట్టి వాకిట్లోకి చక్కా వచ్చేశారు.

ఆయన సాయంత్రం అన్ని వీధులూ తిరిగేవారు మంత్రించిన విబూదితో. ఆయన ఇంట్లోలేనప్పుడు ఎవరైనా వస్తే సోమిదేవమ్మగారు భర్తని తలుచుకొని విభూది పెడ్తుంది. అవధాన్లుగారి కొడుకు పేరిశాస్త్రి వచ్చిన వాళ్ళని తిట్టుకుంటూ ఇంత విబూదిగడ్డ పడేస్తాడు.

విబూది అన్నం పెడ్తుందా! ఒకళ్ళు కూర, ఇంకొకళ్ళు మజ్జిగ తీసుకొచ్చి ఇస్తే ఇంతకాలం గడిచిందిగాని పంటలు పండక వూరంతా దరిద్రం అనుభవిస్తున్న దశలో అవధాన్లుగారి ఇల్లు గడవటం కష్టమై పోయింది. ఎదిగొచ్చిన పేరిశాస్త్రి గుళ్ళో అభిషేకం చేసి సంపాదించటం మొదలెట్టాడు. పేరిశాస్త్రి ముఖం చూసి అవధాన్లుగారబ్బాయంటే ఎవరూ నమ్మరు. అంతేకాదు అవధాన్లుగారి దీక్ష వేరు. ఇతని దీక్ష వేరు. పేరిశాస్త్రి మద్య మహర్షి. నిరంతర పాన సమాధిలో ఉండాలని కోరుకుంటాడు. అది చాలక ప్రపంచంలోని సుఖాలన్నీ ఆడదాని కౌగిట్లో ఉన్నాయని నిశ్చయంగా నమ్మినవాడు. ఆడవాళ్ళ పెదవులందుకోటానికి

అభిషేకాల డబ్బులు చాలకపోతే కృష్ణరేవులో సంకల్పాలు చెప్పి సంచయనాలు చేయించి యాత్రికుల్ని పిండి సంపాదించేవాడు. "మూడురూపాయలు అక్కడ పెట్టకపోతే ముక్తి లేదనేవాడు." ఆ డబ్బులు రొంటిని దోపుకుని సరాసరి ముండ ఇంటికి వెళ్ళేవాడు.

పేరిశాస్త్రి సంగతి తెలిసి అవధాన్లుగారు మంచం పట్టారు. రోజు రోజుకీ కుంగిపోతూ "అమరేశ్వరా! నన్ను నీలో కలుపుకోవయ్యా" అంటూ ఏడుస్తున్నారు. కాని పేరిశాస్త్రి మారలేదు. అతని స్నేహితులంతా ఇలా మాట్లాడుకొనేవారు!

"అది ముద్దెట్టుకుంటానని బుగ్గ కొరికేసిందిరా!"

"అది వాటేసుకుంటే వొళ్ళు వొరుసుకుపోయిందిరా!"

"అది తొడ మెలికేస్తే గుండె చురుక్కుమందిరా బాబూ!"

"అబ్బ దాని వక్షాలు ....."

ఈ మాటలు పేరిశాస్త్రికి సామవేదంలా వినిపించేవి, అభిషేకాలు చేస్తున్నా, సంకల్పాలు చెబుతున్నా పేరిశాస్త్రి మనస్సులో ఆ పెదవులు, ఆ వక్షాలు, ఆ వొంపులు, ఆ కదలికలు ....... ఇవే ఆడుతూ ఉండేవి.

రోజూ రాత్రి మూడు గంటలకికాని కొంపచేరని పేరిశాస్త్రి తలుపు మెల్లిగా కొడ్తూ "అమ్మా" అని పిలిచేవాడు. విషయం తెలిస్తే భర్త బాధపడతాడని తలుపు దగ్గరే మంచం వేసుకునేది సోమిదేవమ్మగారు. ఒకరోజు తెల్లవారుజామున పేరిశాస్త్రి ఇల్లు చేరేటప్పటికి తలుపు తెరిచేఉంది. ఇదేమా? అనుకొంటూ గడపదాటేసరికి సోమిదేవమ్మగారు పరుగెత్తుకొచ్చి కొడుకును గట్టిగా కావిలించుకొని "మీ నాన్నగారు వెళ్ళిపోయార్రా తండ్రీ!" అంటూ బావురుమంది. ఆవిడ కొడుకుని కావిలించుకుని విడువలేదు. అవే వక్షాలు, అవే చేతులు, అవే కాళ్ళు, అదే శరీరం, అదే కౌగిలింత. పేరిశాస్త్రి ఏమైపోయాడు?

ఆర్నెల్ల పసిపాప అయిపోయి భళ్లు భళ్లున ఏడుస్తూ తల్లి పాదాల దగ్గర కూలబడ్డాడు.*